క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



ఉయ్యూరు: పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉయ్యూరు ఆర్డీఓ రాజు ఆదేశించారు. ఉయ్యూరు పట్టణంలోని ఏడు పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను తనిఖీ చేశారు. పోలింగ్ పకడ్బందీగా జరిగేలా, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మస్తాన్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నున్నలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ - 2లో భాగంగా శుక్రవారం ఉదయం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలోని వైఎస్సార్ హెల్త్ కేర్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు. ప్రముఖ వైద్యులు పాల్గొని ప్రజలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తారని చెప్పారు.

ఎన్టీఆర్ జిల్లా ఎంఈఓ - 2 అసోసియేషన్ నూతన పాలకవర్గం

విజయవాడరూరల్: ఎన్టీఆర్ జిల్లా మండల విద్యాశాఖాధికారుల - 2 అసోసియేషన్ ఎన్నిక గురువారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరిగిందని విజయవాడ రూరల్ మండల విద్యాశాఖాధికారి - 2 అజ్మీర సూరిబాబు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు సోమశేఖర్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికలో జిల్లా అధ్యక్షుడిగా అజ్మీర్ సూరిబాబు నాయక్(విజయవాడ రూరల్), ప్రధాన కార్యదర్శి మొగిలి వీరాస్వామి, ట్రెజరర్ విజయలక్ష్మి, జిల్లా గౌరవాధ్యక్షుడిగా బి.బాలాజీ ఎన్నికైనట్లు ఎ.సూరిబాబు పేర్కొన్నారు.

15 నుంచి ఎస్సీ యువతకు శిక్షణ

కంకిపాడు: ఆంధ్రప్రదేశ్ చర్మకార పారిశ్రామిక సంస్థ సహకారంతో ఎస్సీ యువతకు పీఎం అజయ్ స్కీమ్, లెదర్ స్కేటర్ స్కిల్ కౌశల్ ద్వారా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిమెట్ల సురేష్ బాబు అన్నారు. నెప్పల్లి గ్రామంలోని లెదర్ వర్కర్స్ ట్రెనింగ్ సెంటర్‌ను గురువారం ఆయన సందర్శించారు. సురేష్‌బాబు మాట్లాడుతూ నెప్పల్లిలోని శిక్షణా కేంద్రంలో ఈనెల 15వ తేదీ నుంచి 45 రోజులు పాటు ఎస్సీ యువతకు శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు వారు శిక్షణకు అర్హులన్నారు. 9వ తరగతి పైబడి చదివిన వారు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, కుల, వ్యక్తిగత ధ్రువీకరణ పత్రాలతో సెల్ 93479 02265 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వాటర్ పైప్‌లైన్లకు మరమ్మతులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో పలు చోట్ల వాటర్ పైప్‌లైన్లకు గురువారం మరమ్మతులు చేపట్టారు. గ్రామంలోని రైస్‌మిల్లు రోడ్డులో సిమెంట్ రహదారి నిర్మాణంలో భాగంగా పైప్‌లైన్ మరమ్మతులకు గురైంది. అలాగే నెహ్రూనగర్‌లోని మూడు బొమ్మల సెంటర్‌లో మోటారు బోరు లీక్ అయ్యింది. దీంతో వెంటనే స్పందించిన పంచాయతీ అధికారులు మరమ్మతులు చేశారు. రైస్‌మిల్లు రోడ్డులో ధ్వంసమైన పైప్ లైన్ ప్రాంతంలో కొత్త లైన్ వేశారు. లీక్ అవుతున్న బోరు వద్ద మరమ్మతులు నిర్వహించి సమస్యను పరిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు బాసటగా నిలవాలి



ఉయ్యూరు: అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి అండగా నిలవాలని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని) అన్నారు. ఉయ్యూరు పట్టణ శివారు నాగన్నగూడెంలో బుధవారం రాత్రి ప్రమాదవశాత్తూ చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో నిమ్మగడ్డ నరసింహారావు పూరిల్లు, వెంకటేశ్వరరావు పశువుల పాక దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులను చైర్మన్ నాని, కమిషనర్ వెంకటేశ్వరరావు గురువారం పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు పీఎస్ఎస్ బాలాజీ, శంకర్‌నాథ్‌లు రూ.15 వేలు విలువ చేసే సామగ్రి అందజేశారు. ప్రభుత్వ పరంగా అందించాల్సిన సాయాన్ని అందిస్తామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

సంక్షేమం కోసం జగనన్నను మళ్లీ గెలిపించాలి

- చంద్రబాబు, పవన్ మోసగాళ్లు
- దొంగలంతా పొత్తుతో కలిసొస్తున్నారు.. నమ్మితే మోసపోయినట్లే
- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్
- ఉప్పలూరులో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ



ఉప్పలూరులో డ్వాక్రా మహిళలకు చెక్కులు అందజేస్తున్న రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్

కంకిపాడు: రాష్ట్రంలో సంక్షేమం కోసం జగనన్నను మళ్లీ గెలిపించాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ కోరారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో ఉప్పలూరు, వేల్పూరు, మంతెన, తెన్నేరు, మారేడుమాక గ్రామాల స్థాయిలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కులు పంపిణీ కార్యక్రమం ఉప్పలూరు సెయింట్ ఆన్స్ పాఠశాలలో గురువారం రాత్రి నిర్వహించారు. ఆయా గ్రామాలకు సంబంధించి 335 స్వయం సహాయ సంఘాలకు గానూ 3,350 మంది సభ్యులకు రూ.297.86 లక్షలు ఆసరా సొమ్ము విడుదల కావటంతో సొమ్మును డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు అందించారు.

ఎన్నో విప్లవాత్మక మార్పులు..

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. చంద్రబాబు, పవన్ కల్యాణ్ మోసగాళ్లు...దగాకోర్లు..దొంగలంతా ఏకమై పొత్తులతో కలిసి వస్తున్నారు.. తస్మాత్ జాగ్రత్త.. మోసగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దు...జగనన్నకు బాసటగా నిలిచి సంక్షేమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు, పవన్, మూడో వ్యక్తిని ఢిల్లీ నుంచి దింపుకునేందుకు రెడీ అయ్యారని విమర్శించారు. చంద్రబాబు గత ఎన్నికల్లో ఇంటికో ఉద్యోగం ఇప్పిస్తానని, లేనిపక్షంలో నిరుద్యోగ భృతి కింద రూ.2 వేలు ఇస్తానని ప్రకటించారన్నారు. డ్వాక్రా రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చి హామీలన్నింటికీ అటకెక్కించి ప్రజల్ని వంచించిన ఘనుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా డ్వాక్రా రుణాలు మాఫీ చేసింది, అమ్మ ఒడితో విద్యాభివృద్ధికి పాటుపడుతోంది, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆంగ్ల మాధ్యమం, పల్లెకు వైద్య సేవలు వంటి ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు.

వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలి..

పేదల పిల్లలు ఇంగ్లిష్ మీడియం చదివితే పెద్దలు ఓర్వలేక కోర్టులను సైతం ఆశ్రయించారని, ఆఖరికి పేదల పక్షాన నిలిచిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే గెలిచిందని మంత్రి జోగి రమేష్ చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం అమలులోకి వచ్చిందన్నారు. సచివాలయ, వలంటీరు వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అర్హులందరికీ సంక్షేమం అందుతుందన్నారు. విద్య, వైద్య రంగాలకు, వ్యవసాయానికి ప్రభుత్వం చేయూత అందిస్తోందన్నారు. ఇన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్న సీఎం జగనన్నను, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని దించే కుట్ర జరుగుతుందన్నారు. ప్రజలు చైతన్యమై, మోసపు మాటలను విశ్వసించకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలని, పెనమలూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, సర్పంచ్ లాం సోనియా, కమ్మ, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లు రామినేని రమాదేవి, నందిపాటి బిందుమాధవి, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరి రాణి, పలువురు స్థానిక నాయకులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డ్వాక్రా వీఓఏలు పాల్గొన్నారు. తొలుత డ్వాక్రా మహిళలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను మంత్రి జోగి రమేష్ సందర్శించారు. అనంతరం మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి



యనమలకుదురులో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజు

పెనమలూరు: పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జగనన్న ఇళ్ల స్థలాలకు చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని ఆర్డీఓ డి.రాజు ఆదేశించారు. యనమలకుదురు 1వ సచివాలయంలో జగనన్న లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆర్డీఓ గురువారం పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గత కొంత కాలం క్రితం పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి స్థలాలు లబ్ధిదారులకు అప్పగించిందన్నారు. ఇప్పటికే లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టారన్నారు. లబ్ధిదారులకు శాశ్వత హక్కు కల్పించటానికి ప్రభుత్వం ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ చేపట్టిందని తెలిపారు. యనమలకుదురులో 2,618 మంది లబ్ధిదారులు ఇళ్ల స్థలాలు పొందారన్నారు. ఇప్పుడు వారికి రిజిస్ట్రేషన్ ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా స్థల రిజిస్ట్రేషన్ చేస్తోందని చెప్పారు. లబ్ధిదారులు సచివాలయ సిబ్బందితో సహకరించి త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



పునాదిపాడు-2 సచివాలయంలో రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్న అధికారులు

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కంకిపాడు: పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అగ్రి బోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు అన్నారు. పునాదిపాడు-2 సచివాలయ పరిధిలో జగనన్న లే అవుట్లలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభించారు. సచివాలయ పరిధిలో ఇళ్ల స్థలాలు పొందిన పేదలకు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించారు. నత్తా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలను అందించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలను ఇళ్ల వద్దే అందజేస్తోందని చెప్పారు. పథకాల లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్‌కు బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల అసోసియేషన్ ఇళ్ల స్థలాల పరిశీలన



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని ఆర్ఎస్ నంబర్ 751లో 2.36 ఎకరాల్లో విజయవాడ జర్నలిస్టుల అసోసియేషన్‌కు గతంలో ప్రభుత్వం ప్రతిపాదించిన ఇళ్ల స్థలాల ప్రాంతాన్ని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ గురువారం పరిశీలించారు. ఆయన వెంట విజయవాడ రూరల్ తహసీల్దార్ పి.జాహ్నవిరెడ్డి, మండల సర్వేయర్ రమేష్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



గన్నవరంరూరల్: మండలంలోని గోపవరపుగూడెం గ్రామంలో గురువారం క్రాప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలల మేళా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు అందజేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని చెప్పారు. స్థానిక ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

పెనమలూరు: కానూరులో విద్యుత్ విజిలెన్స్ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గ్రామంలో విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలను విజిలెన్స్ అధికారులు విస్తృతంగా తనిఖీ చేశారు. మొత్తం 37 బృందాలు తనిఖీల్లో పాల్గొన్నాయి. 2,884 గృహ సర్వీసులతో పాటు వాణిజ్య సముదాయాల సర్వీసులు తనిఖీ చేయగా అదనపు లోడు 155 కిలో వాట్ మొత్తానికి రూ.3.10 లక్షలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఈఈ పి.హరిబాబు మాట్లాడుతూ.. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమన్నారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగితే వెంటనే 94408 12362, 94408 12363 సెల్ నంబర్లకు సమాచారం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఈఈ జి.కమలకుమారి, డెప్యూటీ ఈఈ ఎం.పూర్ణ చంద్రరావు, ఏఈఈ గోవిందరాజు, 11 మంది ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఈ హరిబాబు

పాలవెల్లువతో పాడి రైతులకు అధిక రాబడి

ఉంగుటూరు: పాడి రైతులు అమూల్ కేంద్రాల్లో పాలు పోయడం వలన అధిక ధరను పొందవచ్చని ఈఓపీఆర్డీ అమీర్ బాషా తెలిపారు. మండలంలో తేలప్రోలు, ఆత్కూరు, పెద అవుటపల్లి గ్రామాల్లో జగనన్న అమూల్ పాలవెల్లువ అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న పాలవెల్లువ వలన రైతులకు కలిగే లాభాలను వివరించాలని వలంటీర్లను ఆదేశించారు. ఇంకా పాల వెల్లువ సర్వే నమోదుకాని రైతులు ఉంటే త్వరితగతిన నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అమూల్ రూట్ ఆఫీసర్ రవికుమార్, ఐకేపీ ఏపీఎం సాంబశివరావు, తేలప్రోలు, ఆత్కూరు పశు వైద్యాధికారులు సీహెచ్ మల్లిబాబు, నాగార్జున, పాడి రైతులు, డ్వాక్రా మహిళలు, వలంటీర్లు పాల్గొన్నారు.



పెద అవుటపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ అమీర్‌బాషా

ఘనంగా సాయిబాబా మందిరాల వార్షికోత్సవం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ఐటీఐ రోడ్డులోని షిర్డీ సాయిబాబా మందిర 18వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. షిర్డీసాయికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి సాయిబాబాను దర్శించుకుని, పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై సాయిబాబా విగ్రహ గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో 2 వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ కొల్లి వెంకట్రావు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



షిర్డీ సాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

చలివేంద్రపాలెంలో..

కంకిపాడు: చలివేంద్రపాలెంలో వేం చేసి ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. మందిరం 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తెల్లవారు జాము నుంచే ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పండ్ల రసాలతో స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తులు ఆలపించిన భగవద్గీత పారాయణం భక్తిపారవశ్యం చెందేలా సాగింది. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్న సమారాధన జరిపించారు. పూజా కార్యక్రమాలను శ్రీ సాయిరామ్ తీర్థ సేవా ట్రస్ట్ ప్రతినిధులు పర్యవేక్షించారు.

గంగూరులో నీటి సమస్య పరిష్కారానికి మంత్రి ఆదేశం



గంగూరులో నీటి సమస్యను తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: గంగూరులో మంచినీటి సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని మంత్రి జోగి రమేష్ అధికారులను ఆదేశించారు. గంగూరు సచివాలయం - 2 పరిధి ఏఆర్ నగర్‌లో మంచినీరు సక్రమంగా రావటం లేదని స్థానికులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సమాచారం తెలుసుకున్న మంత్రి జోగి రమేష్ గంగూరుకు చేరుకున్నారు. స్థానికులు మంత్రికి వివరాలు తెలుపుతూ ఏఆర్‌నగర్‌లో మంచినీరు కలుషితంగా వస్తున్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చినా అధికారులు సమస్యను పరిష్కారం చేయటం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి జోగి రమేష్ వెంటనే స్పందిస్తూ రూ.3 లక్షలతో వెంటనే బోరు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన త్రాగునీరు కాలనీ వాసులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఈ నాంచారయ్యను ఆదేశించారు. ఈ పనులు నాలుగైదు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. వేసవి వస్తున్నందున అన్ని గ్రామాల్లో తాగునీరు సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో వాహనాలు నడపాలి

ఉయ్యూరు: అప్రమత్తతతో వాహనాలను నడిపి రహదారి భద్రత నియమాలను పాటించాలని డీటీసీ పురేంద్ర తెలిపారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో రహదారి భద్రతా మహోత్సవాల్లో భాగంగా రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. బస్సు, ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై శిక్షణ ఇచ్చారు. రోటరీ కంటి ఆస్పత్రి సహకారంతో కంటి పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో డీటీసీ పురేంద్ర మాట్లాడుతూ వాహనం నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రయాణికుల భద్రత, సంక్షేమం, కుటుంబాల జీవితాలను గుర్తెరిగి వ్యవహరించాలని చెప్పారు. పాఠశాల, కళాశాలల బస్సులు నడిపే డ్రైవర్లు నిత్యం బస్సు ఫిట్‌నెస్, కండిషన్‌లను చూసుకుని నడపాలని సూచించారు. కార్యక్రమంలో గుడివాడ ఆర్టీఓ విజయసారథి, ఉయ్యూరు ఎంవీఐ సుబ్బారావు, ఏఎంవీఐ ఆయేషా, రోటరీ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, నాగసుబ్రహ్మణ్యం, సయ్యద్ అనిస్ తదితరులు పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీటీసీ పురేంద్ర

పంట కుంటలతో సాగునీటి సమస్యలకు చెక్

నున్న(విజయవాడరూరల్): పంట కుంటలున్న గ్రామాల్లో సాగునీటి సమస్యలు తలెత్తవని ఎన్టీఆర్ జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జె.సునీత తెలిపారు. నున్న గ్రామంలో వజ్రాల నాగిరెడ్డి మామిడి తోటలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పంట కుంట(ఫామ్‌పాండ్) తవ్వకం పనులను పీడీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు, ఒక మీటరు లోతు కొలతలతో తవ్విన పంట కుంటలో 36 వేల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉంటుందన్నారు. ఆ నీటిని మామిడి తోటలకు, కూరగాయ పంటలకు ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. ప్రభుత్వమే పంట కుంటలను ఉచితంగా తవ్విస్తోందన్నారు. చిన్న, సన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ అసైన్డ్ భూములున్న రైతులు కూడా పంట కుంటలను తవ్వించుకునేందుకు అర్హులన్నారు. ఈ ఏడాది ఎన్టీఆర్ జిల్లాలో ప్రతి మండలంలో 100 పంట కుంటలను తవ్వించడానికి ప్రభుత్వం లక్ష్యంగా నిర్ధారించిందని చెప్పారు. మామిడి, జామ, సపోటా, బత్తాయి, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, యాపిల్ బెయిర్, పండ్ల తోటలను సాగు చేసుకొనే రైతులు నీటికుంటలను తవ్వించుకోవచ్చునన్నారు. ఆసక్తిగల రైతులు నీటి కుంటలను తవ్వించుకుని పండ్ల తోటలను, కూరగాయ తోటలను సాగు చేసుకొని అధిక ఆదాయం పొందవచ్చునని సూచించారు. నీటి కుంటలతో భూగర్భ జలాలు అభివృద్ధి అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఇంజినీర్ కన్సల్టెంట్ కె.శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ కిరణ్మయి, ఫీల్డ్ అసిస్టెంట్ టి.సురేఖ, రైతు వజ్రాల నాగిరెడ్డి ఉన్నారు.



నున్నలో పంట కుంట పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ సునీత

నేడు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

పెనమలూరు: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నులిపురుగుల నివారణకు మాత్రలు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పోస్టర్ ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. మండలంలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన వారు 56,934 మంది ఉన్నారన్నారు. వీరికి ప్రభుత్వం నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు పంపిణీ చేస్తారని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు కాలేజీల్లోనూ మాత్రలు అందజేస్తారన్నారు. యువత మాత్రలు వేసుకొని నులి పురుగుల నివారణకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి లలిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రూరల్ మండలంలో పంపిణీ

గన్నవరంరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అందజేశారు. రక్తహీనత నివారణకు ఈ మాత్రలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజారోగ్య కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఈ మాత్రలు అందజేసినట్లు చనుపల్లివారిగూడెం హెచ్ఎం వెంకన్న బాబు, ఏఎన్ఎం మేరీగ్రేస్ తెలిపారు.



పెనమలూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ కుమార్‌బాబు, వైద్య సిబ్బంది

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో మహిళ అదృశ్యం కావడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు శివలింగేశ్వరనగర్ 4వ లైన్‌కు చెందిన రెడ్రోతు రాజేష్ తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతను కారు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. కాగా అతని తల్లి శ్రీలక్ష్మి కుట్టుమిషన్ పనులు చేస్తోంది. ఆమె ఈ నెల 6న పనికి వెళ్తున్నానంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్తింటి వారిపై వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న ఎన్నారై భర్తతో పాటు అత్తింటి వారిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి నారాయణపురం కాలనీ రోడ్డు అంకుర అపార్టుమెంట్‌లో ఉంటున్న యలమంచిలి రష్మి గతేడాది సెప్టెంబర్‌లో హైదరాబాద్‌కు చెందిన ఎన్నారై చెముడ్లమూడి సాయికృష్ణను పెద్దల సమక్షంలో కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. భర్త అమెరికాలో ఉద్యోగం చేస్తాడు. కాగా పెళ్లి జరిగిన తరువాత భర్త వికృత చేష్టలు చేయటంతో భార్య అభ్యంతరం తెలిపింది. పైగా అదనపు కట్నం తీసుకు రమ్మని భర్తతో పాటు అత్త విజయలక్ష్మి, మామ అరుణ్‌కుమార్, ఆడపడుచు మన్నే అనుపమ వేధించసాగారు. భర్త గత కొద్దికాలం క్రితం భార్య రష్మిని వదిలేసి అమెరికా వెళ్లాడు. అదనపు కట్నం ఇస్తేనే కాపురానికి రావాలని అత్తింటి వారు వేధించటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు అత్తింటి వారిపై కేసు నమోదు చేశారు.

చనిపోతానని భవనం ఎక్కిన విద్యార్థి

పెనమలూరు: తాను చదవలేక పోతున్నానని, తల్లిదండ్రులకు ఫీజుల భారం మోపుతున్నానని విద్యార్థి భవనం పైకి ఎక్కి చనిపోతానని బెదిరించిన ఘటన పెనమలూరు సెంటర్‌లో గురువారం జరిగింది. పెనమలూరు సెంటర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ అకాడమీలో విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. కాగా అదే హాస్టల్‌లో గుణదలకు చెందిన ఓ విద్యార్థి ఇంటర్ బైపీసీ చదువుతున్నాడు. అతనికి తల్లిదండ్రులు రూ.2 లక్షలు ఫీజు కట్టారు. అయితే అతనికి మార్కులు తక్కువగా రావటం, చదువు భారంగా మారి ఆశించిన స్థాయిలో చదవలేక పోయాడు. దీంతో విద్యార్థి మనస్తాపంతో లెటర్ రాసి కాలేజీ భవనం పైకి ఎక్కి దూకి చనిపోతానని చెప్పాడు. ఇది గమనించిన స్థానికులు అతనిని వారించినా అతను చనిపోతానని బెదిరించాడు. ఈ లోగా పోలీసులు, సహ విద్యార్థులు భవనంపై ఉన్న అతడిని చాకచక్యంగా పట్టుకున్నారు. అతను రాసిన లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థిని పోలీసులు అతని తల్లిదండ్రులకు అప్పగించారు.